సాక్షి తిరుపతి

మంగళవారం ‌‌। 6 । మే । 2025



గ్రీవెన్స్‌కు వినతుల వెల్లువ

ప్రజా సమస్యల పరిష్కార వేదికను సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించారు. వినతులను స్వీకరించారు. - 8లో



నేటి నుంచి జాతర సంబరం

తిరుపతి గ్రామ దేవత తాతయ్యగుంట గంగమ్మ జాతర మంగళవారం రాత్రి చాటింపుతో ప్రారంభం కానుంది. - 8లో



అండర్ బ్రిడ్జికి స్థల పరిశీలన

నాయుడుపేట మండలం విన్నమాల వద్ద హైవేపై అండర్ పాస్ బ్రిడ్జి నిర్మాణానికి స్థల పరిశీలన చేపట్టారు. - 8లో

● శోభాయమానం



శేషాచల సానువులు సోమవారం సాయంత్రం దేదీప్యంగా ప్రకాశించాయి. భానుడి కిరణాల వెలుగులో దివ్యతేజోవిరాజితంగా విలసిల్లాయి. ఈ క్రమంలో ప్రకృతి రమణీయ దృశ్యాలు ఆవిష్కృతమయ్యాయి. తిరునగరవాసుల కనువిందు చేశాయి. భువి వైకుంఠానికి పయనమవుతున్న అశేష భక్త జనుల హృదయాలను రంజింపజేశాయి. ఏడుకొండల వైభవానికి ప్రతీకగా నిలిచాయి. ఆధ్యాత్మిక క్షేత్ర ప్రతిష్టను ఇనుమడింపజేశాయి. శ్రీవారి కరుణాకటాక్ష వీక్షణాలు పొందిన మధురానుభూతిని మనోఫలకంలో నిక్షిప్తం చేశాయి. – సాక్షి ఫొటోగ్రాఫర్, తిరుపతి

● సుముహూర్తం



తిరుమలలో పద్మావతి, శ్రీనివాసుల పరిణయోత్సవాలను మంగళవారం నుంచి మూడు రోజుల పాటు అత్యంత వైభవంగా నిర్వహించేందుకు టీటీడీ ఏర్పాట్లు చేసింది. నారాయణగిరి ఉద్యానవనంలో కల్యాణ వేదికను సిద్ధం చేసింది. – తిరుమల

న్యూస్‌రీల్

నృసింహుని హుండీ లెక్కింపు



కానుకలు లెక్కిస్తున్న సిబ్బంది

రాపూరు : పెంచలకోనలోని పెనుశిల లక్ష్మీనరసింహస్వామి ఆలయ హుండీ లెక్కింపును సోమవారం చేపట్టినట్లు ఏసీ శ్రీనివాసులరెడ్డి తెలిపారు. 38 రోజులకు గాను శ్రీవారికి హుండీ ద్వారా కానుకల రూపంలో రూ.45,88,223 ఆదాయం వచ్చినట్లు వెల్లడించారు. అలాగే 89 గ్రాముల బంగారం, 2.1 కేజీల వెండి వచ్చినట్లు వివరించారు. కార్యక్రమంలో ఈఓ కవిత తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి..సంక్షేమానికి ప్రాధాన్యం



మాట్లాడుతున్న జేసీ శుభం బన్సల్

తిరుపతి అర్బన్ : జిల్లాలో అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల అమలుకు అత్యంత ప్రాధాన్యమివ్వాలని జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో ట్రైనీ కలెక్టర్ సందీప్ రఘువాన్షీ, డీఆర్‌ఓ నరసింహులతో కలసి అధికారులతో సమీక్షించారు. జేసీ మాట్లాడుతూ మంగళవారం రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ, కుటుంబ సంక్షేమ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ, జోనల్ ఇన్‌చార్జి అధికారి ఎంటీ కృష్ణబాబు ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం ఉందని వెల్లడించారు. అన్నిశాఖల అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రోజ్‌మాండ్, ముఖ్య ప్రణాళికాధికారి వెంకటేశ్వర్లు, డీపీఓ సుశీలాదేవి, డ్వామా పీడీ శ్రీనివాస ప్రసాద్, సాంఘిక సంక్షేమశాఖ జిల్లా అధికారి విక్రమకుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

రాజకీయ జాతర

శ్రీతాతయ్యగుంట గంగమ్మ జాతరను రాజకీయ వేదికగా మార్చేశారు. పెత్తనం చెలాయించడమే లక్ష్యంగా కూటమి నేతలు పోటీ పడుతున్నారు. రాష్ట్ర పండుగకు చేపట్టాల్సిన ఏర్పాట్లను గాలికి వదిలేసి ఆధిపత్యం కోసం ఆరాటపడుతున్నారు. ఉత్సవ కమిటీలో స్థానం కోసం హడావుడి చేస్తున్నారు. టీడీపీ..జనసేన..బీజేపీ నాయకుల అత్యుత్సాహంపై నగరవాసులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. వందల ఏళ్ల చరిత్ర కలిగిన గంగ జాతర ప్రతిష్టతో ఆటలాడుకోవడంపై మండిపడుతున్నారు. మహోత్సవం నిర్వహణ కమిటీలో నగర మేయర్‌కు స్థానం కల్పించకపోవడంపై ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



తాతయ్యగుంట గంగమ్మ ఆలయం

రాష్ట్ర పండుగకు పేలవంగా ఏర్పాట్లు

- కనిపించని శ్రీతాతయ్యగుంట గంగమ్మ ఉత్సవ శోభ
- 15 మందితో కమిటీ వేసిన కలెక్టర్
- కూటమి నేతలకు మాత్రమే చోటు కల్పించడంపై విమర్శలు
- మేయర్ శిరీష పేరు లేకపోవడంపై నగరవాసుల ఆగ్రహం
- పెత్తనం కోసం పోటీ పడుతున్న టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు

సాక్షి ప్రతినిధి, తిరుపతి : తిరుపతి నగరంలో ఏటా ప్రతిష్టాత్మకంగా నిర్వహించే తాతయ్య గుంట గంగమ్మ జాతరపై నీలినీడలు అలుముకున్నాయి. జాతరకు నేడు చాటింపు ఘడియలు దగ్గరపడుతున్నా.. నగరంలో రాష్ట్ర పండుగ సందడి కనిపించడం లేదు. కూటమి ప్రభుత్వం, ఆ పార్టీల నేతలు గంగజాతర నిర్వహణ గురించి పట్టించుకోకుండా.. కమిటీలో స్థానం కోసం వెంపర్లాడుతున్నారు. ఎలాగైనా ఉత్సవ కమిటీలో చోటు దక్కించుకుని పెత్తనం చెలాయించేందుకు పోటీపడుతున్నారు. పేలవంగా ఉన్న గంగజాతర ఏర్పాట్లే ఇందుకు నిదర్శనం. తిరుపతి తాతయ్య గుంట గంగమ్మ జాతర అంటే.. రాష్ట్రంలోనే ప్రత్యేకం. తొమ్మిది వందల ఏళ్ల చరిత్ర కలిగిన ఈ జాతరను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని అంగరంగ వైభవంగా నిర్వహించారు. జాతర ప్రాముఖ్యతను గుర్తించిన నాటి ప్రభుత్వం 2023లో రాష్ట్ర పండుగగా ప్రకటించిన విషయం తెలిసిందే. అదే ఏడాది తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాల స్థాయిలో గంగ జాతరను జరిపించారు. గతంలో చాటింపునకు కొద్ది రోజుల ముందు నుంచే తిరుపతిలో జాతర సందడి కనిపించేది. నేడు ఆ పరిస్థితి లేకపోవడంతో నగరవాసులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

కూటమిలో కమిటీల గోల

తిరుపతి తాతయ్య గుంట గంగమ్మ జాతర ముందే ఆలయ పాలకమండలిని నియమించేవారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి 11 నెలలు గడుస్తున్నా పాలకమండలిని ఏర్పాటు చేయలేదు. కూటమిలో కుమ్ములాటల కారణంగా పాలకమండలి వేయకపోవడంతో కలెక్టర్ ఉత్సవ కమిటీని నియమించారు. ఎన్నడూ లేని విధంగా గంగ జాతరకు ఉత్సవ కమిటీ వేయడం ఇదే తొలిసారి. ఆ కమిటీలో 15 మంది ఉంటే.. అందరూ కూటమి నేతలే. ఇందులో నగర మేయర్ డాక్టర్ శిరీష పేరు చేర్చలేదు. ఆమె మేయర్ మాత్రమే కాదు. ఆలయం ఉన్న వార్డు కార్పొరేటర్ కూడా కావడం గమనార్హం. అయినప్పటికీ డాక్టర్ శిరీష పేరు లేకపోవడంపై నగర ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

సందట్లో సడేమియా!

కలెక్టర్ వేసిన కమిటీపైనే విమర్శలు వెల్లువెత్తుతుంటే.. సందట్లో సడేమియా అంటూ ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు 27 మందితో మరో కమిటీని ప్రతిపాదిస్తూ దేవదాయశాఖ కమిషనర్‌కు లేఖ రాశారు. అందులో 11 మంది ఎమ్మెల్యే ఆరణి వర్గీయులు, మరో 12 మంది మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ వర్గీయులు. ఇందులో 11 మంది ఒకే సామాజిక వర్గానికి చెందిన వారే ఉన్నారు. ఎమ్మెల్యే సిఫారసు లేఖలోని పేర్లను తెలుసుకున్న టీడీపీ, జనసేన శ్రేణులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఎవరినీ సంప్రదించకుండా ఎవరికి వారు పేర్లు పంపడంపై మండిపడుతున్నారు. ఈ విషయాన్ని సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిసింది.

ఎమ్మెల్యే ఒత్తిడి

ఎమ్మెల్యే ఆరణి పంపిన ఉత్సవ కమిటీ సిఫారసు లేఖకు చెక్‌పడినట్లు విశ్వసనీయ సమాచారం. ఎవరినీ సంప్రదించకుండా ఏక పక్షంగా ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యే వారి అనుచరుల పేర్లు పంపితే ఎలా కుదురుతుంది? అని ఆ కమిటీకి ఆమోదం తెలుపకుండా పక్కన పడేసినట్లు ప్రచారం జరుగుతోంది. తాను పంపిన లేఖకు విలువలేకుండా పోవడంతో ఎమ్మెల్యే ఆరణి వర్గీయులు తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. ఎలాగైనా ఆ కమిటీని ప్రకటించాలని ఎమ్మెల్యే ఆరణి తీవ్రస్థాయిలో ఒత్తిడి చేస్తున్నట్లు తెలిసింది. కలెక్టర్ కమిటీని ప్రకటించిన తర్వాత దేవదాయశాఖ మరో కమిటీని ప్రకటిస్తే తేడాలొస్తాయని అసిస్టెంట్ కమిషనర్ డైలమాలో పడ్డట్టు సమాచారం. ఎమ్మెల్యే ఒత్తిడితో కమిటీని ప్రకటిస్తే.. కలెక్టర్‌కి విలువ ఉండదు కదా? అని దేవదాయశాఖ అధికారులు ఆందోళన చెందుతున్నట్లు తెలుస్తోంది. కూటమి నేతలు తమ కుమ్ములాటలతో రాష్ట్ర పండుగ అయిన తాతయ్యగుంట గంగజాతరను అభాసుపాలు చేస్తున్నారని నగర వాసులు ఆందోళన చెందుతున్నారు.

డిగ్రీ పరీక్ష కేంద్రాల తనిఖీ



పరీక్ష నిర్వహణను పరిశీలిస్తున్న వీసీ అప్పారావు

తిరుపతి సిటీ : ఎస్వీయూ పరిధిలో డిగ్రీ 2, 4వ సెమిస్టర్‌కు సంబంధించి పరీక్ష కేంద్రాలను సోమవారం వీసీ సీహెచ్ అప్పారావు ఆకస్మిక తనిఖీ చేశారు.వేసవి నేపథ్యంలో విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేయాలని కళాశాల యాజమాన్యాలను ఆదేశించారు. మాస్ కాపీయింగ్‌కు పాల్పడితే సదరు విద్యార్థితో పాటు కళాశాలలపైనా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

కండలేరు జలాలు విడుదల



నీరు విడుదల చేస్తున్న ఎమ్మెల్యే, అధికారులు

రాపూరు: కండలేరు జలాశయం నుంచి సోమవారం చెన్నైకు నీటిని విడుదల చేశారు. తెలుగుగంగ ఎస్‌ఈ రాధాకృష్ణారెడ్డి, ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ ఈ మేరకు గంగమ్మకు పూజలు నిర్వహించి నీరు వదిలిపెట్టారు. ఎస్‌ఈ మాట్లాడుతూ చెన్నై వాసుల దాహార్తిని తీర్చడంతోపాటు శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు , తిరుపతి జిల్లాల రైతులకు తాగు, సాగునీటి అవసరాల కోసం 500 క్యూసెక్కుల కండలేరు జలాలను విడుదల చేశామన్నారు. ఏటా చెన్నై నగరానికి 5 టీఎంసీలు సరఫరా చేస్తున్నట్లు వెల్లడించారు. ప్రస్తుతం కండలేరులో 45 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్లు వివరించారు. విడుదల చేసిన నీటిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఈఈలు విజయకుమార్‌రెడ్డి, రాధాకృష్ణమూర్తి, రామచంద్రమూర్తి, డీఈఈ రేవతి, ఏఈలు తిరుమలయ్య, అనిల్‌బాబు పాల్గొన్నారు.

గాడి తప్పిన బర్డ్!



- పర్యవేక్షణ కరువై అస్తవ్యస్తంగా పాలన
- ఆస్పత్రి సిబ్బందిలో లోపించిన సమన్వయం
- నానా అవస్థలు పడుతున్న రోగులు
- శస్త్రచికిత్సలకు పడిగాపులు
- నెలల తరబడి ప్రదక్షిణలు

● మదనపల్లెకు చెందిన నజీర్ అనే వ్యక్తి సర్జరీ కోసం ఆరు నెలల క్రితం బర్డ్ ఆస్పత్రికి వచ్చాడు. ఓపీ తీసుకుని వైద్యుల వద్ద పరీక్షలు చేయించుకున్నాడు. మోకాలికి శస్త్రచికిత్స అనివార్యమని డాక్టర్లు నిర్ధారించారు. ఇందుకు సంబంధించిన అన్ని రికార్డులను తీసుకెళితే కార్యాలయ సిబ్బంది పరిశీలించి మార్చిలో ఓ తేదీని సర్జరీకి ఖరారు చేశారు. అదే తేదీన ఆపరేషన్ జరుగుతుందనే నమ్మకంతో నజీర్ ఆస్పత్రికి వచ్చాడు. అయితే మరో నెల తర్వాత రావాలని బర్డ్ సిబ్బంది వెనక్కి పంపించేశారు. మరోసారి నిర్దేశించిన తేదీ ప్రకారం ఏప్రిల్‌లో సర్జరీ కోసం రాగా అదే సమాధానం రావడంతో బాధితుడు నిలదీశాడు. దీంతో ఈ నెలలో కచ్చితంగా శస్త్రచికిత్స చేస్తామని పంపేశారు.

● అనంతపురం జిల్లా యల్లనూరుకు చెందిన లక్ష్మమ్మ అనే మహిళ పరిస్థితి అయితే మరింత దయనీయం. మోకీలు మార్పిడి కోసం ఇప్పటికే ఆస్పత్రి చుట్టూ పలుమార్లు తిరిగింది. రెండు నెలల క్రితం సర్జరీ కోసం తేదీని ఖరారు చేసిన బర్డ్ అధికారులు ఆ రోజు ఆస్పత్రికి వస్తే బెడ్లు లేవని వెనక్కి పంపించారు. ఈనెల 5వ తేదీ సోమవారం రోజున సర్జరీ తేదీని ఇచ్చారు. అన్ని సర్దుకుని కుటుంబ సభ్యులతో సహా ఆస్పత్రికి రాగా ఈరోజు కుదరదు వచ్చే నెలలో రావాలంటూ మరోసారి వెనక్కి పంపించడంతో బంధువులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వృద్ధులతో ఇంత దారుణంగా వ్యవహరిస్తారా అంటూ మండిపడ్డారు. ఎప్పుడు అవకాశం ఉంటే అదే తేదీని ఇవ్వ కుండా ఇలా తిప్పించడం ఏంటని ఆవేదన వ్యక్తం చేశారు.

ఇవి మచ్చుకు రెండు కేసులు మాత్రమే. ఇలా ఒకరిద్దరు కాదు. సర్జరీ కోసం వచ్చే రోగులలో ఎక్కువ మందికి ఈ అనుభవాలే ఎదురవుతున్నాయి. టీటీడీ బర్డ్ ఆస్పత్రి పాలన గందరగోళంగా మారింది. దాదాపు పది నెలలుగా పర్యవేక్షణ లేకపోవడంతో ఆస్పత్రి అస్తవ్యస్తంగా తయారైంది. వైద్యులు, సిబ్బంది, కార్యాలయ ఉద్యోగుల మధ్య సమన్వయ లోపంతో రోగులకు తిప్పలు తప్పడం లేదు.

తిరుపతి తుడా: తిరుపతిలోని బర్డ్ ఆస్పత్రికి రోజూ 300 వందలకు పైగా ఓపీలు వస్తుంటాయి. ఇందులో 10 మంది వరకు వివిధ సర్జరీల కోసం రెఫర్ అవుతుంటారు. బెడ్ ఖాళీల ప్రకారం రోగులకు సర్జరీ తేదీని ఖరారు చేయాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై ఉంటుంది. సమన్వయలోపంతో శస్త్రచికిత్సల తేదీ ఖరారు విషయంలో స్పష్టత కరువైంది. బెడ్ల వివరాలు, వైద్యుల సమాచారం తెలుసుకుని తేదీని ఖరారు చేయాల్సి ఉంటుంది. అలా కాకుండా ఇష్టారాజ్యంగా తేదీలను నిర్ధారిస్తుండడంతో రోగులు ఇబ్బంది పడుతున్నారు. పలుమార్లు మారుస్తూ తేదీలను కేటాయిస్తుండటంతో అనేక వ్యయ ప్రయాసలకు గురవుతున్నారు. నడవలేని స్థితిలో ఉన్న రోగులు సుదూర ప్రాంతాల నుంచి పలుమార్లు బర్డ్ ఆస్పత్రి చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వస్తోంది. అధికారుల తీరు రోగులకు శాపంగా మారింది. బర్డ్ వైద్య సిబ్బంది ఇప్పటికైనా రోగుల సర్జరీ విషయంలో పక్కా ప్రణాళికలతో తేదీలను ఇవ్వాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

వేధిస్తున్న వైద్యుల కొరత

బర్డ్ ఆస్పత్రిలో సీనియర్ ఆర్థోపెడిక్ సర్జన్లు కరువయ్యారు. కేవలం ఇద్దరు మాత్రమే సీనియర్ వైద్యులు ఉండడంతో భారమంతా వారిపైనే పడుతుంది. నాణ్యతతో కూడిన వైద్యం అందించాలంటే మరింత మంది సీనియర్ ఆర్థోపెడిక్ సర్జన్ల అవసరం ఉంది. గతంలో దేశంలోని ప్రముఖ ఆర్థోపెడిక్ సర్జన్లను బర్డ్ ఆస్పత్రికి రప్పించి ఖరీదైన వైద్యాన్ని రోగులకు అందించేవారు. ఇందుకోసం గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అప్పటి టీటీడీ పాలకమండలి అనేక నిర్ణయాలను తీసుకుంది. ప్రస్తుతం వివిధ ప్రాంతాల నుంచి ప్రముఖ వైద్యులు రాకపోవడంతో బర్డ్‌లోని డాక్టర్లే ఆపరేషన్లు చేస్తున్నారు. బర్డ్ ఆస్పత్రిలో అంతర్జాతీయ ప్రమాణాలు ఉంటాయన్న ఉద్దేశంతో వివిధ రాష్ట్రాల నుంచి ఇక్కడికి వస్తుంటారు. అయితే ప్రస్తుతం అలాంటి పరిస్థితులు ఎక్కడా కనిపించడం లేదు. రోగి ఓపీ తీసుకోవడం మొదలు వైద్యుల వద్ద పరీక్షలు చేసుకోవడం, ఆపై సర్జరీలు చేసుకుని తిరిగి వెళ్లేవరకు అంతా తికమకగా ఉంది. అస్తవ్యస్తంగా ఉన్న బర్డ్ ఆస్పత్రిని గాడిలో పెట్టి ఉన్నత ప్రమాణాలతో సకాలంలో వైద్య సేవలు అందించేలా టీటీడీ చర్యలు తీసుకోవాల్సి ఉంది.

సూళ్లూరుపేట మున్సిపల్ కమిషనర్‌పై ఫిర్యాదు

చిత్తూరు అర్బన్: సూళ్లూరుపేట మున్సిపల్ కమిషనర్ కే.చిన్నయ్యపై చిత్తూరులో పోలీసులకు ఫిర్యాదు చేశారు. సోమవారం చిత్తూరు మున్సిపల్ కమిషనర్ నరసింహ ప్రసాద్ స్థానిక వన్ టౌన్ పోలీసులకు రాతపూర్వకంగా ఫిర్యాదు అందజేశారు. చిన్నయ్య తన తండ్రికి ఉద్యోగం ఉండగా, ఆ విషయాన్ని దాచిపెట్టి చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్‌లో కారుణ్య నియామకం కింద ఉద్యోగం పొందాడని, తప్పుడు సర్టిఫికెట్లను అందజేసి, పదోన్నతులు పొందాడని ఫిర్యాదులో తెలిపారు. రాష్ట్ర మున్సిపల్ పరిపాలన శాఖ (డీఎంఏ) ఆదేశాలతో కేసు నమోదుకు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ప్రస్తుతం సూళ్లూరుపేట మున్సిపల్ కమిషనర్‌గా పని చేస్తున్న చిన్నయ్యపై తదుపరి చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు చేయగా దీనిపై పోలీసులు విచారణ ప్రారంభించారు.

11 నుంచి కల్యాణ వెంకన్న బ్రహ్మోత్సవాలు




పోస్టర్ ఆవిష్కరిస్తున్న టీటీడీ జేఈఓ వీరబ్రహ్మం

తిరుపతి కల్చరల్ : నారాయణవనంలోని శ్రీపద్మావతి సమేత శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 11 నుంచి 19వ తేదీ వరకు వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్లు టీటీడీ జేఈవో వి.వీరబ్రహ్మం తెలిపారు. ఆయన సోమవారం బ్రహ్మోత్సవాల పోస్టర్లను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ఉత్సవాల సందర్భంగా ఈ నెల 6న కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం, 10న అంకురార్పణ నిర్వహిస్తారని తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా ప్రతిరోజూ ఉదయం 7.30 నుంచి 9.30 గంటల వరకు, తిరిగి రాత్రి 7 నుంచి 9 గంటల వరకు వాహన సేవలు చేపడతామని వెల్లడించారు. ఈ నెల 18వ తేదీ రాత్రి 8.30 నుంచి 10 గంటల వరకు స్వామివారి కల్యాణోత్సవం నిర్వహిస్తారన్నారు. ఈ సందర్భంగా టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్, అన్నమాచార్య ప్రాజెక్టు, దాస సాహిత్య ప్రాజెక్టు సంయుక్తంగా ఆధ్యాత్మిక, భక్తి సంగీత, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో స్థానిక ఆలయ డెప్యూటీ ఈవో నాగరత్నం, ఏఈవో రవి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

రేపటి నుంచి మంత్రి లోకేష్ పర్యటన

తిరుపతి అర్బన్: రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఈ నెల 7, 8 తేదీల్లో జిల్లాలో పర్యటించనున్నట్టు కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. ఆయన బుధవారం విమానంలో ముంబయి నుంచి బయలుదేరి మధ్యాహ్నం 3.30 గంటలకు రేణిగుంట ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారని తెలిపారు. తర్వాత సాయంత్రం 5.30 గంటల నుంచి 8 వరకు సత్యవేడులోని వీఎంకే కల్యాణ మండపంలో టీడీపీ నేతలు, కార్యకర్తలతో సమావేశమవుతారని తెలిపారు. గురువారం ఉదయం 11 గంటలకు శ్రీసిటీలో ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్ పరిశ్రమ భూమిపూజ కార్యక్రమంలో పాల్గొంటారని వెల్లడించారు. అనంతరం రేణిగుంట ఎయిర్‌పోర్టుకు చేరుకుని హైదరాబాద్‌కు వెళతారని పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు.

కొనసాగుతున్న సమ్మె



నినాదాలు చేస్తున్న సీహెచ్‌ఓలు

తిరుపతి తుడా : న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్స్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల నిరవధిక సమ్మె కొనసాగుతోంది. తిరుపతి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయం ముందు సీహెచ్‌ఓలు ఆందోళన కార్యక్రమాలు చేపడుతున్నారు. అందులో భాగంగా సోమవారం సుమారు 200 మందికి పైగా సీహెచ్‌ఓలు నిరసన వ్యక్తం చేశారు. తమ డిమాండ్లను పరిష్కరించాలంటూ నినాదాలు చేశారు. ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. పలువురు సీహెచ్‌ఓలు మీడియాతో మాట్లాడుతూ మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్లను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగ భద్రత, ఎన్‌హెచ్‌యూ ఉద్యోగులతో సమానంగా 23 శాతం వేతన సవరణ చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం మానవత్వంతో స్పందించాలని విజ్ఞప్తి చేశారు.

క్లుప్తంగా

ప్రశాంతంగా ఏపీపీఎస్సీ పరీక్షలు

తిరుపతి అర్బన్: తిరుపతి నగరంలో సోమవారం ఏపీపీఎస్సీ గ్రూప్–1 మెయిన్స్ పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించినట్లు కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. 911 మంది అభ్యర్థులకు 619 మంది హాజరైనట్లు వెల్లడించారు. 292 మంది గైర్హాజరయ్యారని వివరించారు. పరీక్ష కేంద్రాల్లో అభ్యర్థులు ఎలాంటి ఇబ్బంది పడకుండా పకడ్బందీగా వసతులు కల్పించినట్లు తెలిపారు.

చెస్‌లో జస్వితరెడ్డి ప్రతిభ



పెళ్లకూరు : విజయవాడలో సోమవారం నిర్వహించిన రాష్ట్రస్థాయి చెస్ పోటీల్లో అండర్–9 విభాగానికి సంబంధించి ఎద్దల జస్వితరెడ్డి ప్రతిభను కనబరచింది. మండలంలోని పాలచ్చూరుకు చెందిన ఎద్దల నరేంద్రరెడ్డి, అనూష దంపతుల కుమార్తె జస్వితరెడ్డి చదరంగంలో సత్తా చాటి నాలుగో స్థానం దక్కించుకుంది.

పోలీసు కుటుంబాలకు ఆర్థిక సాయం



చెక్కులు అందజేస్తున్న ఎస్పీ హర్షవర్ధన్ రాజు

తిరుపతి క్రైమ్: విధి నిర్వహణలో ఉంటూ మృతిచెందిన పోలీసుల కుటుంబ సభ్యులకు సోమవారం జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు ఆర్థిక సాయం అందజేశారు. ఏఎస్ఐ టీ మల్లికార్జున రావు, హెడ్ కానిస్టేబుల్ బి.మధుసూదన్‌రావు ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. ఈ క్రమంలో వారి కుటుంబ సభ్యులకు రూ.లక్ష చొప్పున చెక్కులు అందజేశారు.

'బర్డ్'లో సర్వర్ డౌన్

తిరుపతి తుడా : టీటీడీ బర్డ్ ఆస్పత్రిలో సర్వర్ డౌన్ కావడంతో వైద్య సేవలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. సోమవారం ఉదయం సుమారు గంటకు పైగా సర్వర్ పనిచేయకపోవడంతో సిబ్బంది విధులకు ఆటంకం కలిగింది. దీంతో సిబ్బంది మాన్యువల్‌గా ఓపీ సేవలు అందించారు. టీటీడీ ఈడీపీ సిబ్బంది ఇంటర్నెట్ లాగిన్ సేవలను పునరుద్ధరించడంతో సేవలు యధావిధిగా కొనసాగాయి.

ఘాట్ రోడ్డులో ప్రమాదం

తిరుమల: తిరుమల నుంచి తిరుపతికి వచ్చే మొదటి ఘాట్ రోడ్డులో సోమవారం కారు డివైడర్‌ను ఢీకొంది. తెలంగాణకు చెందిన భక్తులు తిరుమల వెంకటేశ్వర స్వామిని దర్శించుకుని కారులో తిరుపతికి బయలుదేరారు. అక్కగార్ల గుడి వద్ద బస్సును ఓవర్‌టేక్ చేసే క్రమంలో కారు డివైడర్ ఢీకొంది. దీంతో కారులో ప్రయాణిస్తున్న ఇద్దరు భక్తులకు చిన్నపాటి గాయాలయ్యాయి. వారిని రుయా ఆస్పత్రికి తరలించారు.

● పుచ్చ రైతు కుదేలు!



గూడలి వద్ద పొలంలోనే వదిలేసిన పుచ్చకాయలు



వాకాడు వద్ద తక్కువ ధరకే పంటను అమ్ముకుంటున్న రైతులు

జిల్లావ్యాప్తంగా ఈ ఏడాది దాదాపు 48 వేల ఎకరాల్లో పుచ్చసాగు చేపట్టారు. ఇప్పటి వరకు సుమారు 27వేల ఎకరాల్లో కోత పూర్తి చేశారు. 1.60లక్షల టన్నుల దిగుబడి రావడంతో తమ కష్టాలు గట్టెక్కినట్టే అని సంబరపడ్డారు. అయితే గిట్టుబాటు ధర లేకపోవడంతో దిగాలుపడ్డారు. గత ఏడాది టన్ను రూ.17వేల నుంచి రూ.20వేల వరకు పలకడంతో లాభాలు కళ్లజూశారు. ప్రస్తుతం టన్ను రూ.5వేల నుంచి రూ.6వేలు మాత్రమే ఉండడంతో కూలి ఖర్చులు కూడా రాక పొలాల్లోనే పంటను వదిలేస్తున్నారు. ఒక్కో రైతు ఎకరాకు రూ.50వేల నుంచి రూ.70వేల వరకు పెట్టుబడి నష్టపోయినట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. – వాకాడు

ఎన్నాళ్లీ ఎదురుచూపులు?



ఇనగలూరు సమీపంలో ఎస్ఎస్ కెనాల్ నిర్మాణానికి రైతుల నుంచి ప్రభుత్వం తీసుకున్న భూములు



భూపత్రాలను చూపుతున్న రైతులు

- పరిహారం కోసం 18 ఏళ్లుగా పడిగాపులు
- అధికారుల చుట్టూ ప్రదక్షిణలు
- ఎస్ఎస్ కెనాల్ నిర్వాసితుల గోడు
- ఆదుకోవాలంటూ అన్నదాతల వేడుకోలు

రేణిగుంట : 'సోమశిల–స్వర్ణముఖీ' కెనాల్ కాల్వ తమ ప్రాంత రైతుల సాగునీటి కష్టాలను పటాపంచలు చేస్తుందని వారంతా ఆశ పడ్డారు. తమ పొలాలు పోయినా పర్లేదు.. తక్కిన రైతుల భూములు సస్యశ్యామలం అవుతాయన్న ఆశతో సాగు భూములు కాలువ నిర్మాణానికి వదిలేశారు. అయితే 18 ఏళ్లుగా తమకు ప్రభుత్వం నుంచి భూములకు నష్ట పరిహారం అందించలేదని రైతులు నిట్టూరుస్తున్నారు. శ్రీకాళహస్తి మండలం ఇనగలూరు, మామిడిగుంట, ఆంజనేయపురానికి చెందిన 27 మంది చిన్న, సన్నకారు రైతుల 32 ఎకరాల భూములకు ప్రభుత్వం పరిహారం ఇవ్వకుండా పరిహసిస్తోంది.

కెనాల్ పనులు పరిస్థితి ఇదీ..

నెల్లూరు జిల్లా సోమశిల రిజ్వాయర్ నుంచి స్వర్ణముఖీ మీదుగా వెంకటగిరి, శ్రీకాళహస్తి, సత్యవేడు రైతులకు సాగునీరు అందించే లక్ష్యంతో 2008లో అప్పటి ముఖ్యమంత్రి దివంగత వైఎస్ఆర్ ప్రాజెక్టును తీసుకొచ్చారు. అయితే అప్పట్లో రైతుల నుంచి కాలువ నిర్మాణానికి భూములు తీసుకున్నారు. పనులు కూడా 60 శాతం వరకు పూర్తయ్యాయి.

పనులు అర్ధాంతరంగా నిలిచిపోవడం..

ఎస్ఎస్ కెనాల్ కాలువకు తమ పొలాలను కోల్పోయిన శ్రీకాళహస్తి మండలంలోని ఇనగలూరు, మామిడి గుంట, ఆంజనేయపురం గ్రామాల 27 మంది రైతులకు చెందిన 32 ఎకరాల పొలాలను అప్పట్లోనే ప్రాజెక్టు అధికారులు సేకరించారు. వారి నుంచి భూమికి సంబంధించిన పత్రాలను తీసుకున్నారు. అయితే అప్పటి నుంచి నయా పైసా పరిహారం చెల్లించలేదు. కెనాల్ కాల్వ పనులు అర్ధాంతరంగా ఆగిపోవడంతో వీరి పొలాల్లో కాల్వ పనులు చేపట్టలేదు. నెల్లూరులోని ప్రాజెక్టు కార్యాలయానికి అనేకసార్లు వెళ్లినా కాలయాపన చేస్తున్నారని రైతులు వాపోతున్నారు. అయితే ఇటీవల ప్రభుత్వం బడ్జెట్ కేటాయిస్తే గానీ పరిహారం చెల్లించలేమని అధికారులు చెప్పడంతో ఏళ్ల తరబడి నిరీక్షించిన పేద రైతులు నిట్టూరుస్తున్నారు. ప్రభుత్వ పెద్దలు జోక్యం చేసుకుని తమకు పరిహారం చెల్లించి ఆదుకోవాలని వేడుకుంటున్నారు.

మా బతుకే లాగేసుకున్నారు..



మా కుటుంబానికి ఆదరువుగా ఉన్న 1.2 ఎకరాల పొలం కాలువ కోసం ప్రభుత్వం లాగేసుకుంది. ప్రస్తుతం కూలి పనులతో జీవిస్తున్నాం. మా బతుకే లాగేసుకొని కనీసం నష్ట పరిహారం కూడా ఇవ్వకుండా జాప్యం చేస్తున్నారు.

– షేక్ అబ్దుల్ రషీద్, మామిడిగుంట, శ్రీకాళహస్తి మండలం

ఒక్క రూపాయి పరిహారం ఇవ్వలేదు..



ఎస్ఎస్ కెనాల్ కాల్వ కోసం 1.5 ఎకరాల భూమి ప్రభుత్వం తీసుకుంది. ఇప్పటి వరకు ఒక్క రూపాయి నష్టపరిహారం ఇవ్వలేదు. అధికారులు మారుతున్నారే తప్ప మా సమస్యను పరిష్కరించే వారే లేరు.

– సుబ్బరామయ్య, ఇనగలూరు, శ్రీకాళహస్తి మండలం

భూములిచ్చి పరిహారం కోసం యాచిస్తున్నాం



కొన్నేళ్లుగా పరిహారం కోసం ఆఫీసులు చుట్టూ తిరుగుతున్నాం. మా భూములు ప్రభుత్వానికి ఇచ్చి పరిహారం కోసం యాచించే పరిస్థితి దాపురించింది. మాకు తిరిగే ఓపిక లేదు.. చేతులెత్తి మొక్కుతాం. న్యాయం చేయండి.

– లక్ష్మమ్మ, ఇనగలూరు, శ్రీకాళహస్తి మండలం

దామలచెరువులో అనుమానితుల హల్‌చల్

పాకాల : మండలంలో దామలచెరువులో ఆదివారం రాత్రి ముగ్గురు అనుమానితులు హల్‌చల్ చేశారు. సోమవారం స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. ఇద్దరు పురుషులు, ఒక మహిళ స్థానిక రామాలయం వీధి, రెడ్డివారివీధి, మక్కాన్ వీధి, బజారు వీధిలో పలు ఇళ్ల తలుపులు కొట్టారు. స్థానికులు వెంటపడడంతో ఒకరు పట్టుబడ్డాడు. మరో ఇద్దరు పరారయ్యారు. దీనిపై సీఐ సుదర్శన్‌ప్రసాద్ మాట్లాడుతూ వారు దొంగలు కాదని, మామిడికాయ మండీల్లో పని చేయడానికి వచ్చారని, దారి తెలియక పలు వీధుల్లో తిరిగారని తెలిపారు.

గ్రీవెన్స్‌కు వినతుల వెల్లువ



అర్జీలను పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి అర్బన్ : ప్రజా సమస్యల పరిష్కార వేదిక (గ్రీవెన్స్)కు సోమవారం వివిధ సమస్యలపై వినతులు వెల్లువెత్తాయి. కలెక్టర్ వెంకటేశ్వర్ ఈ మేరక అర్జీలను స్వీకరించారు. ప్రతి అర్జీని పరిశీలించి పరిష్కారం దిశగా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. గ్రీవెన్స్‌లో మొత్తం 293 వినతులు వచ్చినట్లు కలెక్టరేట్ అధికారులు వెల్లడించారు. జేసీ శుభం బన్సల్, డీఆర్‌ఓ నరసింహులు, స్పెషల్ కలెక్టర్లు దేవేంద్రరెడ్డి, రోజ్‌మాండ్ పాల్గొన్నారు.

పోలీస్ కార్యాలయంలో..

తిరుపతి క్రైమ్: జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 105 ఫిర్యాదులు అందినట్టు ఎస్పీ హర్షవర్ధన్‌రాజు తెలిపారు. సంబంధిత అర్జీలు పరిష్కరించాలని సిబ్బందిని ఆదేశించారు.

'బిగ్ బాస్'తో సమాజానికి హాని



మాట్లాడుతున్న సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ

తిరుపతి కల్చరల్: బిగ్‌బాస్ షో కారణంగా సమాజానికి హాని కలుగుతుందని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ ఆరోపించారు. సోమవారం గంధమనేని శివయ్య భవన్‌లో ఆయన మాట్లాడారు. బిగ్‌బాస్ షో ద్వారా నీచపు సంస్కృతికి ప్రజలు ఆకర్షితులయ్యే ప్రమాదముందని మండిపడ్డారు. తక్షణమే బిగ్‌బాస్ షోను నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ క్రమంలోనే హైకోర్టును ఆశ్రయించినట్లు వెల్లడించారు. మూడేళ్ల తర్వాత కోర్టు నుంచి బిగ్‌బాస్ నిర్వాహకులకు, బాధ్యులకు నోటీసులు వెళ్లాయని తెలిపారు. తెలంగాణలో మిస్ వరల్డ్ పోటీలను నిర్వహించడం మంచి పద్ధతి కాదన్నారు. స్త్రీని గౌరవించడమే భారతీయ సంస్కృతి గొప్పదనమని, ప్రపంచ దేశాలన్నీ మనల్ని అనుసరిస్తుంటే హైదరాబాద్‌లో స్త్రీల అందాల పోటీలు నిర్వహించడం దౌర్భాగ్యమని విమర్శించారు.

అండర్ బ్రిడ్జికి స్థల పరిశీలన

నాయుడుపేట టౌన్ : చెన్నై– కోల్‌కత్తా జాతీయ రహదారిపై విన్నమాల వద్ద అండర్‌పాస్ బ్రిడ్జి నిర్మించేందుకు ఎన్‌హెచ్ జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ వెంకటేశ్వర్లు సోమవారం స్థల పరిశీలన చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ ఎంపీ గురుమూర్తి చొరవతో వంతెన నిర్మాణానికి అధికారులు చర్యలు తీసుకుంటుండడంపై హర్షం వ్యక్తం చేశారు. అండర్ పాస్ బ్రిడ్జితో పాటు సర్వీస్ రోడ్లు సైతం నిర్మించాలని కోరారు. ఈ మేరకు పీడీ మాట్లాడుతూ వెంటనే వంతెనకు అవసరమైన స్థల కేటాయింపులకు సంబంధించి ప్రణాళిక తయారు చేయాలని సర్వేయర్ చరణ్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో డీఎస్పీ చెంచుబాబు, నేతలు నాగిరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి, అనిల్‌కుమార్‌రెడ్డి అర్వభూమి శ్రీనివాసులు రెడ్డి, మధురెడ్డి పాల్గొన్నారు.

గ్రూప్–1 పరీక్ష కేంద్రాల తనిఖీ

తిరుపతి క్రైమ్: తిరుపతి నగరంలో సోమవారం నిర్వహించిన గ్రూప్–1 పరీక్ష కేంద్రాలను జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పటిష్టమైన భద్రత కల్పించినట్టు తెలిపారు. పరీక్ష పూర్తయ్యే వరకు అప్రమత్తంగా ఉండాలని సిబ్బందిని ఆదేశించారు.

నిషేధిత హారన్ల తొలగింపు

తిరుపతి క్రైమ్ : నగరంలో పెద్ద పెద్ద సౌండ్ చేస్తూ ట్రాఫిక్ ఇబ్బంది కలిగిస్తున్న నిషేధిత హారన్లను ట్రాఫిక్ పోలీసులు సోమవారం తొలగించారు. ట్రాఫిక్ డీఎస్పీ రామకృష్ణ ఆచారి ఆధ్వర్యంలో బృందాలుగా విడిపోయి పలు ప్రాంతాలలో తనిఖీలు చేపట్టారు. అధిక శబ్దాలు కలిగించే 20 ఆటోలకు హారన్లు తొలగించి జరిమానాలు విధించారు.

నేటి నుంచి జాతర సంబరం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి కల్చరల్/ తిరుపతి అర్బన్: తిరుపతి గ్రామదేవత శ్రీతాతయ్యగుంట గంగమ్మ జాతర మంగళవారం సాయంత్రం పుట్టింటి సారె, అర్ధరాత్రి చాటింపుతో ప్రారంభం కానుంది. ఈ మేరకు ఆలయం వద్ద క్యూలు, చలువ పందిళ్లు, విద్యుద్దీపాలంకరణ పూర్తి చేశారు. సోమవారం గంగమ్మ ఆలయం వద్ద భద్రతా ఏర్పాట్లను ఎస్పీ హర్షవర్ధన్‌రాజు పరిశీలించారు. ఎస్పీ మాట్లాడుతూ భక్తుల రద్దీకి తగ్గట్టు బందోబస్తు కల్పిస్తున్నట్లు వెల్లడించారు. బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని పోలీసు సిబ్బందిని ఆదేశించారు. ట్రాఫిక్ నియంత్రణ, మళ్లింపులకు యాక్షన్ ప్లాన్ రూపొందించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ రవి మనోహరాచారి, డీఎస్పీ భక్తవత్సలం, ట్రాఫిక్ డీఎస్పీ రామకృష్ణ, సీఐలు సాధిక్ ఆలీ, శ్రీనివాసులు పాల్గొన్నారు.

అధికారులు, ప్రజా ప్రతినిధులతో సమీక్ష

గంగ జాతర ఏర్పాట్లపై కలెక్టర్ వెంకటేశ్వర్ సోమవారం కలెక్టరేట్‌లో ఎస్పీ హర్షవర్ధన్‌రాజు, కార్పొరేషన్ కమిషనర్ మౌర్య, ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులుతోపాటు పలువురు అధికారులు ప్రజా ప్రతినిధులతో సమావేశమయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ వీఐపీలకు ఉదయం 6 నుంచి 8 వరకు సాయంత్రం 3 నుంచి 5 వరకు మాత్రమే దర్శనాలు ఉంటాయని చెప్పారు. మంగళవారం నుంచి ఈ నెల 14వ తేదీ వరకు జాతర వేడుకలు కొనసాగుతాయని వివరించారు. 6న గంగమ్మ చాటింపు, 7న బైరాగి వేషం, 8న బండ వేషం, 9న తోటి వేషం, 10న దొర వేషం, 11న మాతంగి వేషం, 12న సున్నపు కుండలు, 13న గంగమ్మ జాతర సప్పరం, 14న విశ్వరూప దర్శనం ఉంటుందని వివరించారు. సమావేశంలో డీఆర్‌ఓ నరసింహులు, టీటీడీ బోర్డు మెంబర్ పనబాక లక్ష్మి, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్, వివిధ పార్టీల నేతలు రాజారెడ్డి, సామంచి శ్రీనివాస్, గంగమ్మ ఆలయ ఈఓ జయకుమార్, జిల్లా దేవదా య శాఖ అధికారి రామకృష్ణా రెడ్డి పాల్గొన్నారు.

నీటి సంపునకూ పసుపు రంగులా..?



పసుపు రంగు వేసిన నీటి సంపు

తిరుపతి రూరల్: దామినేడులోని ఇందిరమ్మ ఇళ్లకు కూడా పసుపు రంగులు వేశారు. దీనిపై ఆగ్రహించిన తిరుపతి రూరల్ మండల ప్రజా ప్రతినిధులు సోమవారం ప్రారంభోత్సవాన్ని బహిష్కరించారు. వేదాంత పురం వద్ద ఆరు పంచాయతీల్లో తాగునీటి సమస్య తీర్చడానికి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి చెందిన ఎంపీపీ మూలం చంద్రమోహన్ రెడ్డి, వైస్ ఎంపీపీలు విడుదల మాధవ రెడ్డి, యశోద తిరుపతి మున్సిపాల్టీ ఆధీనంలో నిరుపయోగంగా ఉన్న అండర్ గ్రౌండ్ సంపును తమకు అప్పగించాలని ప్రతిపాదించారు. ఎంపీడీఓ ద్వారా ప్రతిపాదనలు సిద్ధం చేయించి మున్సిపల్ కార్పొరేషన్ అధికారులకు పంపించారు. ఆపై జిల్లా పరిషత్ సమావేశంలో దీనిపై చర్చించి జెడ్పీ నుంచి సంపు మరమ్మతులకు సరిపడా నిధులు తెప్పించారు. ఇంత వరకు బాగానే ఉన్నా.. ఆ సంపును అందుబాటులోకి తెస్తే ఆరు గ్రామ పంచాయతీలకు నీటి సమస్య తీరుతుందని తెలుసుకున్న స్థానిక ఎమ్మెల్యే అధికారులపై ఒత్తిడి తెచ్చి తాను ఒక్కరే సాధించి తెచ్చినట్టుగా పసుపు రంగులు వేయించారు. సోమవారం సంపు ప్రారంభోత్సవానికి సిద్ధం చేశారు. మొదటి నుంచి కష్టపడ్డ వైఎస్సార్‌సీపీకి చెందిన ఎంపీపీ మూలం చంద్రమోహన్ రెడ్డి, వైస్ ఎంపీపీ మాధవ రెడ్డి, ఇతర ప్రజాప్రతినిధులు సోమవారం సంపు ప్రారంభోత్సవాన్ని బహిష్కరించారు. ప్రభుత్వ నిధులతో కట్టించిన సంపునకు పార్టీ రంగులు ఎలా వేస్తారంటూ స్థానిక అధికారులపై ఆగ్రహం వ్యక్తంచేసి అక్కడ నుంచి వెళ్లిపోయారు.

సత్యవేడు టీడీపీలో లుకలుకలు!



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వ్యతిరేక వర్గం నేతలు

సాక్షి టాస్క్‌ఫోర్స్: సత్యవేడు నియోజకవర్గ టీడీపీలో మరో మారు అసమ్మతి వర్గం గొంతు విప్పుతోంది. ఈనెల 7న సత్యవేడులో మంత్రి లోకేష్ పర్యటించనున్న నేపథ్యంలో ఎమ్మెల్యేకు వ్యతిరేక వర్గీయుల కనుసన్నల్లో ఏర్పాట్లు జరుగుతున్నాయి. దీనిపై ఎమ్మెలే ఆది మూలం వర్గీయులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నా రు. ఎమ్మెల్యే కోనేటి ఆది మూలం ఎన్నికల్లో గెలిచిన మూడు నెలలకే మహిళపై లైంగిక వేధింపులకు పాల్పడిన వీడియోల కారణంగా ఆయన ప్రతిష్ట మసకబారింది. అదే సమయంలో ఆయనపై పార్టీ అధిష్టానం సస్పెన్షన్ వేటు వేసింది. ఇదే అదునుగా ఎమ్మెల్యే వ్యతిరేక వర్గం ఆధిపత్యం చెలాయించేందుకు రంగంలో దిగింది.

ఏర్పాట్లలో అసమ్మతి నేతలు

సార్వత్రిక ఎన్నికల సమయంలో టీడీపీ తరఫున పరిశీలకుడిగా ప్రవేశించిన చంద్రశేఖర్ నాయుడు, నియోజకవర్గ కో–ఆర్డినేటర్‌గా చలామణి అవుతున్న శ్రీపతి బాబు ఆధ్వర్యంలో అసమ్మతి నేతలు రెండు రోజులుగా మంత్రి లోకేష్ పర్యటన ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. అధికారుల సైతం వీరి డైరెక్షన్‌లోనే ముందుకు వెళుతున్నారు. దీంతో ఇన్నాళ్లు నియోజకవర్గంలో అధికారిక కార్యక్రమాలు ఎమ్మెల్యేని కాదని చేసేందుకు వీలేదంటూ హుకుం జారీ చేసిన వారికి దిక్కుతోచని పరిస్థితి ఎదురవుతోంది. ఇవన్నీ గమనిస్తున్న టీడీపీ కేడర్ మాత్రం ఈ పరిణామాలు ఎక్కడకు దారితీస్తాయో అంటూ ఆందోళన చెందుతుండడం గమనార్హం.

ఆర్టీసీ అధికారుల వేధింపులపై విజిలెన్స్ విచారణ

సత్యవేడు: సత్యవేడు ఆర్టీసీ డిపో అధికారులు వేధింపులకు గురిచేస్తున్నారని డ్రైవర్ గంగయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు విజిలెన్సు అధికారి తిమ్మారెడ్డి, సీఐ వర్మ సోమవారం విచారణ చేపట్టారు. ఏప్రిల్ 29న డ్రైవర్ గంగయ్య డ్యూటీ నిమిత్తం ఆర్టీసీ గ్యారేజ్‌కు వచ్చాడు. బస్సును సెక్యూరిటీ పాయింట్ వద్దకు తీసుకెళ్లాడు. మధ్యాహ్నం వరకు కండక్టర్ రాకపోవడంతో ఆ సర్వీసును డీఎం వెంకటరమణ రద్దు చేసి మధ్యాహ్నం మూడు గంటల డ్యూటీకి వెళ్లాలని డ్రైవర్ గంగయ్యను ఆదేశించారు. తనకు ఆరోగ్యం సరిగా లేదని, రాత్రి డ్యూటీకి వెళ్లలేనని గంగయ్య చెప్పడంతో డీఎం దూషించాడు. డ్రైవర్ సెక్యూరిటీ పాయింట్ వద్దకు వెళ్లగా అక్కడున్న సెక్యూరిటీ అధికారి సైతం రాత్రి డ్యూటీకి వెళ్లాల్సిందేనని ఆదేశించారు. ఈ నేపథ్యంలో గంగయ్య హైబీపీ కారణంగా కింద పడి పడిపోయాడు. అతన్ని ఆస్పత్రికి తరలించి చికిత్స చేయడంతో కోలుకున్నాడు. తర్వాత అధికారులు దూషించడంపై విజిలెన్సు అధికారులకు ఫిర్యాదు చేశాడు. విచారణకు వచ్చిన విజిలెన్సు అధికారులు తొలుత బాధితుడు గంగయ్యను విచారించి స్టేట్‌మెంట్ నయోదు చేశారు. అనంతరం కంట్రోలర్ వెంకటేశ్వర్లు, సెక్యూరిటీ అధికారి పళని, ఆర్టీసీ కండక్టర్ ఓ వెంకటేశులును విచారించి స్టేట్‌మెంట్ తీసుకున్నారు. అనంతరం ఆర్టీసీ డీఎం వెంకటరమణను విచారించినట్టు తెలిసింది.

కార్పొరేట్ దోపిడీకి అడ్డుకట్ట వేయాలి



వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబుల్‌రెడ్డి

తిరుపతి సిటీ: తిరుపతి జిల్లా వ్యాప్తంగా ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో ముందస్తు అడ్మిషన్ల పేరుతో చేస్తున్న దోపిడీనకి అడ్డుకట్ట వేయాలని వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ బి.ఓబుల్ రెడ్డి డిమాండ్ చేశారు. ఆయన సోమవారం స్థానిక విద్యార్థి విభాగం కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. కార్పొరేట్ విద్యాసంస్థలు విద్యా సంవత్సరం ప్రారంభం కాకముందే ఫీజుల్లో రాయితీ అంటూ తల్లిదండ్రులను మభ్యపెట్టి ముందస్తు అడ్మిషన్ల పేరుతో రూ.లక్షలు దండుకుంటున్నట్టు తెలిపారు. టెక్నో సి బ్యాచ్, ఐకాన్, ఒలంపియాడ్, జేఈఈ, మెడికల్ క్యాంపస్ అంటూ విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నారని మండిపడ్డారు. ఒకటో తరగతికి రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకు వసూలు చేస్తున్నా అధికారులు చోద్యం చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పుస్తకాలను ఒక్కో తరగతికి రూ.9 వేల నుంచి రూ.15 వేల వరకు విక్రయిస్తున్నారని చెప్పారు. విద్యాశాఖ అధికారులు ప్రైవేటు విద్యాసంస్థల దోపిడీని అరికట్టాలని కోరారు.

శ్రీవారి దర్శనానికి 4 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు ఖాళీగా ఉన్నాయి. ఆదివారం అర్ధరాత్రి వరకు 83,380 మంది స్వామిని దర్శించుకున్నారు. 27,936 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామి వారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.35 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టికెట్లు లేని వారికి 4 గంటలు పడుతోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనం లభిస్తోంది. ఇదిలా ఉండగా సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి క్యూలైన్లోకి వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది. ముందుగా వెళ్లిన వారిని లోనికి అనుమతించబోమని స్పష్టం చేసింది.